TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :132 prajadivvs57@gmail. com గురువారం 2 ఏప్రిల్ 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-



## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

**మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు**

**భారత వాతావరణశాఖ హెచ్చరిక**

రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు

మిగతా2లో...

# నేటి నుంచి భూభారతి అమలు

**● ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం ● అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**



తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు. భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను మిగతా2లో...

## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం: మోదీ



: అస్సాం గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారనే నమ్మకం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గోగముఖ్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే అభివృద్ధి, సుస్థిరతకే పట్టంకట్టనున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.'ఈసారి ఎన్నికలు వికసిత్ భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఎన్నికలు. మిగతా2లో...

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు**



2లో

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు



2లో

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**- 3వేల మందితో పోలీస్ బందోబస్తు**




2లో

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

**- ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం**

**- వేలాది మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం**



2లో

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

**5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర**

**ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**



: రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు.

మిగతా2లో...

# అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్

**ఆందోళనలో ఆయకట్టు రైతాంగం**

**కర్నాకటతో మాట్లాడనున్న మంత్రి ఉత్తమ్**



: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణా ధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోం ది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూ రు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.



## రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

**- హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**

గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభిించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ మిగతా2లో...

## జిఎస్టీ వసూళ్లలో 8.8శాతం వృద్ధి

**- మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు**




2లో

# ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది.

కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

: తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

# రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

(మొదటి పేజీ తరువాయి)

కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు.

# అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

**సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు**

**కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం**

**ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



: రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా సబ్జెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

# రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## కొండగట్టు ఆలయంలో అపశృతి

**- చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**

: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ విజయంతో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని ప్రధాని అన్నారు. కాంగ్రెస్‌కి హ్యాట్రిక్ పరాజయం, ఆ పార్టీ యువరాజు రాహుల్‌కు వందోసారి ఓటమి ఖాయమని చెప్పారు. మూడోసారి ప్రధానిగా తాను హ్యాట్రిక్ సాధించానని, అస్సాంలో బీజేపీని కూడా హ్యాట్రిక్ విజయంతో ప్రజలు ఆశీర్వదిస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నానని పేర్కొన్నారు.

బీజేపీ ఎన్నికల మేనిఫె.స్టోను మోదీ ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో అస్సాంలోని 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఇంతవరకూ ఇళ్లు రాని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలను కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కల్పిస్తామన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడాతామని, ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తామని పేర్కొన్నారు. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఢిల్లీ హైకోర్టు బుధవారంనాడు నోటీసులు పంపింది. ఎక్సైజ్ పాలసీ కేసులో సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ హాజరుకాలేదంటూ ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో ఆయనను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది.విచారణ చేపట్టిన హైకోర్టు కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది.ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన ఉద్దేశపూర్వకంగానే విచారణకు హాజరుకాలేదని ఈడీ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించి ట్రయల్ కోర్టు తప్పిందం చేసిందన్నారు. ఈడీ వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ ఈనెల 29వ తేదీకి కేసును వాయిదా వేసింది.దీనికిముందు, మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌పై విచారణకు తగిన ఆధారాలు లేవంటూ ఫిబ్రవరి 27న విచారణ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. కేజ్రీ వాల్‌తో పాటు సిసోడియా, మరో 21 మందిని లిక్కర్ పాలసీ కేసులో నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ కూడా ప్రస్తుతం హైకోర్టు విచారణలో ఉంది.

## జిఎస్టీ వసూళ్లలో 8.8 శాతం వృద్ధి

: దేశంలో జిఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## నేటి నుంచి భూభారతి అమలు


(మొదటి పేజీ తరువాయి)

కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## నగరంలో హనుమాన్ శోభాయాత్ర



నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### ఎదురుగట్ల వేంకన్న సేవలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు..

# సతీసమేతంగా ప్రత్యేక పూజలు

**-వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం: స్వామివారిని దర్శించుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్**

**- పాడిపంటలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి: స్వామివారిని వేడుకున్న పుల్కం రాజు**







**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01** వేములవాడ గ్రామీణ మండలంలోని ఎదురుగట్ల గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం బుధవారం భక్తజనసందోహంతో కిక్కిరిసింది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవ వేడుకలకు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన చైర్మన్ దంపతులకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం పుల్కం రాజు మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం జరిగిన స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలందరూ స్వామివారి కృపాకటాక్షాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతన్నలు సంతోషంగా ఉండాలని మొక్కుకున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీని ఆయన అభినందించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలపై స్పందిస్తా.. నూతన అధ్యక్షులు పిట్టల మనోహర్



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01** న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటానని వేములవాడ నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీచే బుధవారం బార్ హాల్లో ఎన్నికల అధికారి తిరుమల్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ... న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, వృత్తి సంబంధిత ఇబ్బందుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. కోర్టు వసతుల అభివృద్ధి, యువ న్యాయవాదులకు ప్రోత్సాహం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన వెల్లడించారు. అన్ని వర్గాల న్యాయవాదులను కలుపుకొని ముందుకు సాగుతూ, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి విజయం సాధించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పిట్టల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల బాను కృష్ణ, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, లైబ్రరీ సెక్రెటరీ మొగిలి సుజాత, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి వంగల కర్ణ, కోశాధికారి జెట్టి శేఖర్, మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, సీనియర్ ఈసీ సభ్యులు నామాల రాజశేఖర్ రెడ్డి, వేముల సుధాకర్ రెడ్డి, మారు ముఖం అనిల్ కుమార్, జూనియర్ ఈసి సభ్యులు ఉల్లెందుల అనిల్, ఒద్యారపు అనిల్ కుమార్, వడ్లకొండ శ్రీకాంత్, బూర సరిత, సీనియర్ జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు..


# సిఐటియు సిడబ్ల్యూఎఫ్ఐ ఏప్రిల్ ఒకటి బ్లాక్ డే





**ముస్తాబాద్/ ఏప్రిల్ 1 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏప్రిల్ ఒకటి బ్లాక్ డే సి డబ్ల్యూ ఎఫ్ ఐ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్క్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండల కేంద్రంలోని కార్మిక కర్షక సోదరీ సోదరీమణులకు తెలియజేయడం ఏమనగా బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీసబిక్షపతి మాట్లాడుతూ ముస్తాబాద్ మండల కేంద్రం నుండి ఏప్రిల్ ఒకటి బ్లాక్ డే గా నిర్వహించారు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విధానాలను కార్మికునికి నష్టం చేసే విధంగా ఉన్న జీవోలను సవరించాలని12వ జీవోను సవరించాలని 44 చట్టాలను నాలుగు కోడ్ గా ఉంది కావున 29 చట్టాలను 4 కోడ్స్ గా విభజించి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విధానానికి ఈరోజు బ్లాక్ డే నిర్వహించడం జరుగుతుంది ఈ సమ్మెకు ఈనెల 13న జిల్లాలలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సిఐటియు పిలుపుమేరకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్లి వెల్ఫేర్ బోర్డు లో ఉన్న డబ్బులను వృధా కాకుండా ఆరోగ్య రక్షణ పేరుతో దిగబడి తింటున్న ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించి కార్మికుడి జీవితంతో చెలగాటమాడుతున్న ఈ ప్రైవేటు వ్యవస్థను ఎత్తివేయాలని ప్రవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు డబ్బులు ఇవ్వద్దని ప్రభుత్వాన్ని గతంలో జరిగిన విధంగా జరగకుండా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి లేబర్ కమిషనర్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కావున ప్రజలారా కార్మికులారా కార్మిక సోదరులారా సిఎల్సి పేరు చెప్పుకుంటూ రక్త పరీక్షలు ఆరోగ్య రక్ష అనే పేరుతో రక్త పరీక్షలు చేస్తున్నారుచేస్తూ మీ జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ ప్రైవేటు కాంట్రాక్టులకు బుద్ధి చెప్పే విధంగా మీరు ఎవరు ఈ రక్త పరీక్షలు చేసుకోవద్దని వెల్ఫేర్ బోర్డు లో ఉన్న డబ్బులు వృధా కాకుండా ఉండాలంటే ప్రజలే బాధ్యత వహించాలి మీరు రక్త పరీక్ష చేసుకోవడానికి వచ్చిన వారు తరలి తరిమి కొట్టాలి అలాగైతేనే వెల్ఫేర్ బోర్డులో డబ్బులు అలాగే ఉంటాయి ఏప్రిల్ 1..04.2026 రోజున బ్లాక్ డే నిర్వహించడం జరిగింది ఇందులో పాల్గొన్నవారు పిట్ల ప్రవీణ్ సులూరు సత్తయ్య చినుగురుదేవయ్య చినుగురు అంజయ్య సంజీవ్ నరేష్ రాజేందర్ శంకర్ లోకం సత్తయ్య వివిధ రంగాలలో పనిచేసే కార్మికులంతా మమేకమై ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

## చిరుత సంచారం తో భయపడకుండా..రైతులు అప్రమత్తంగా ఉండాలి

**- ఎర్రగడ్డ ఉపసర్పంచ్ రమేష్ నాయక్**







**వీర్నపల్లి ఏప్రిల్ 1(ప్రజా దివాస్):** మైసమ్మ నుంచి ధర్మారం చెరువు వరకు చిరుత పులి సంచరిస్తున్న ఆనవాళ్లు తో రైతులు భయపడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎర్రగడ్డ తాండ ఉప సర్పంచ్ రమేష్ నాయక్ గిరిజన రైతులను కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం లోని ఎర్రగడ్డ తండాలో సుమారు 120 గిరిజన కుటుంబాలు సుమారు 300 ఎకరాలను భూమి నమ్ముకొని వ్యవసాయ ఆధారంగా జీవిస్తున్నారు. ఉదయం నుండి రాత్రులు పంట పనులలో నిమగ్నమై ఉంటారు. ధర్మారం చెరువు ఏరియాలో చిరుత పులి సంచరిస్తునట్లు అడుగుల గుర్తులను రైతులు గుర్తించి బయా ఆందోళనలు చెందుతున్నారని తెలిపారు. ఈ విషయంపై వీర్నపల్లి ఎఫ్ఎస్ఓ రంజిత్ ను వివరణ అడగగా గత రెండు నెలల నుండి అన్ని గ్రామాలలో ప్రజలను చిరుత పులి సంచరిస్తుందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వారి గ్రామాలలో ప్రజలకు తెలిపామనీ ,అడవిని అనుకొని ఎర్రగడ్డ ప్రజలు వ్యవసాయం భూములు ఉన్నాయి అని నీరు తాగడానికి ఆ ఏరియాలో చిరుత సంచరిస్తుందని తెలిపారు.

## రెండు టెండర్లను దక్కించుకున్న గుండెల రాములు





**ముస్తాబాద్/ ఏప్రిల్ 01 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గ్రామ సర్పంచి మట్ట వెంకటేశ్వర్ రెడ్డి పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన తై బజార్ ను వేలంపాటలో రెండు లక్షల 45 వేల రూపాయలకు గుండెల రాములు తండ్రి దుబ్బయ్య ముస్తాబాద్ దక్కించుకోగా మరో వారసంత టెండర్ వేయగా 386000 వేల రూపాయలకు టెండర్ను దక్కించుకోవడం జరిగింది ఒకే వ్యక్తికి రెండు టెండర్లలో పాల్గొనడం సాధించడం అదృష్టంగా భావిస్తున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వేములవాడ రాజన్న దేవస్థానంలో నూతన డీఈఓగా బాధ్యతలు స్వీకారం



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని దక్షిణ కాశిగా పేరుగాంచిన తెలంగాణ అతిపెద్ద దేవాలయం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన డీఈఓగా భాస్కర్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ గారి ఆదేశాల మేరకు రాజన్న ఆలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## నేటి నుంచి లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ బియ్యం!




**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01**తెలంగాణ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీకి ఈరోజు బుధవారం శ్రీకారం చుట్టనున్నారు. వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడునెలల రేషన్ బియ్యం పంపిణీ చేయ నున్నట్టు పౌరసరఫరాల శాఖ తెలిపింది. బుధవారం నుంచి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నది. ఇందుకు సంబంధించి అవసరమైన బియ్యం స్టాక్‌ను రేషన్‌షాపులకు అలాట్ చేసినట్టు వెల్లడించింది.రాష్ట్రంలో 1.05 కోట్ల రేషన్‌కార్డులు ఉండగా, 3.39 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించింది. వీరికి పంపిణీ కోసం ప్రతినెలా సుమారు 2లక్షల టన్నుల బియ్యం అవసరమవుతా యని, దీంతో మూడు నెలలకు 6లక్షల టన్నుల సన్న బియ్యాన్ని అందు బాటులో ఉంచినట్టు పేర్కొన్నది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పంపిణీ చేస్తున్నట్టు తెలిపింది. కాగా, ప్రస్తుతం గోదా ముల్లో బియ్యం నిండుగా ఉండటం, రాబోయే సీజన్లకు సంబంధించి ధాన్యాన్ని నిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో గోదాములను ఖాళీ చేయించాలనే ఉద్దేశంతో కేంద్రం ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

# వేములవాడ మున్సిపల్ లో చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం

- హాజరైన జిల్లా కలెక్టర్ గారిమ అగ్రవాల్
- పారిశుధ్య పనులు, నీటి సరఫరా పకడ్బందీగా చేయాలి
- వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ మెరుగైన సేవలు అందించాలి
- పన్నులు 100 శాతం వసూలు చేయించాలి








**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01** వేములవాడ మున్సిపల్ పరిధిలో నిత్యం పారిశుధ్య పనులు, నీటి సరఫరా పనులు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో బుధవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. అందరి సహకారంతో ఇటీవల మున్సిపల్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామని, నూతన సభ్యులకు అభినందనలు తెలియజేసారు. వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపు, పారిశుధ్య పనులకు చెల్లింపులు, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, సంరక్షణకు ఖర్చు చేయాలని సూచించారు. మున్సిపల్ మొత్తం బడ్జెట్ లో 1/3 శాతం విలీన గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ కార్మికులందరికీ వెంటనే బీమా చేయించాలని కమిషనర్ ను ఆదేశించారు. మున్సిపల్ కు రావాల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని వెల్లడించారు. మున్సిపల్ వార్డ్ సభ్యులు తమ పరిధిలో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలని, అన్ని షాప్ లు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపల్ నిధులతో నిర్మించిన భవనాలు అన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. తడి చెత్తను ఎరువుగా చేసి విక్రయించాలని, పొడి చెత్తను విక్రయిస్తే బల్దియాకు ఆదాయం వస్తుందని తెలిపారు. పార్క్ లు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభానికి సిద్ధం అవుతుందని, నిర్వహణ పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. డీఆర్ సీసీ కేంద్రం పక్కాగా నిర్వహించాలని సూచించారు. నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్సు యుద్ధ విమానం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా వార్డు సభ్యులు, అధికారులు చూసుకోవాలని తెలిపారు. ఏమైనా మరమ్మత్తు ఉంటే చేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బడ్జెట్ సారాంశం: మున్సిపల్ స్వంత నిధుల నుండి అంచనా ఆదాయం రూ. 17.68 కోట్లుగ్రాంట్ల నుండి వచ్చే అంచనా ఆదాయం రూ. 9.00 కోట్లుమొత్తం అంచనా ఆదాయం రూ. 26 .68 కోట్లుఅంచనా వ్యయం గ్రాంట్లతో సహా రూ. 26.05 కోట్లుమి గులు అంచనా విలువ రూ. 0.60 కోట్లుసమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేలరాలినా ఎర్ర మందారం...

- ఎర్రజెండాలతో జంగం అంజయ్య అంతిమయాత్ర...
- హాజరైన సిపిఐ,సిపిఎం నాయకులు.....




**వీర్నపల్లి ఏప్రిల్ 1 (ప్రజా దివాస్)** వీర్నపల్లి మండలకేంద్రంలో ఇటీవలే మరణించిన సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్యకు కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఘన నివాళులు అర్పించారు మృతదేహంపై ఎర్రజెండాలు కప్పి జోహార్లు అర్పించారు,ఎర్రజెండాలు పట్టుకొని కళాకారులు పాటలు పాడుతూ అంతిమయాత్రలో వందలదిగా కదిలారు,కమ్యూనిస్టు నాయకులు మాట్లాడుతూ జంగం అంజయ్య కడవరకు పేదలకోసం కొట్లాడినా వారని అన్నారు ఇలాంటి వారిని కోల్పోవడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. అంజయ్య అనేక సందర్భాలలో తాను చనిపోతే ఎర్రజెండా కండువా కండువాతోనే మరణిస్తానని పలుమార్లు చెప్పడం జరిగిందన్నారు. ఆ మాట తలుచుకొని పలువురు కంటనీరుతో విప్లవ జోహార్లు తెలిపారుఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్,సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న-అరుణ్ కుమార్ సీపీఐ నాయకులు గుంటి వేణు,ప్రజా గాయకులు గజ్జల అశోక్,కమ్మరి తిరుపతి,మాట్లా అశోక్ సీపీఐ నాయకులు సిపిఎం నాయకులు సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**ముస్తాబాద్/ఏప్రిల్ 1 ప్రజా దివాస్** సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్తాబాద్ మండలానికి దాదాపుగా 98 కి పైగా చెక్కులు వచ్చాయని తెలిపారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందనంత దూరంలో లేదు అని తెలియజేయడానికి సీఎం సహాయ నిది పెట్టారని అన్నారు ఎంత పెద్ద కార్పొరేట్ హాస్పిటల్ లో చికిత్స చేయించుకున్న ఆరోగ్యశ్రీ లేనిపక్షంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఈ చెక్కులు అందజేయడం హర్షనీయమన్నారుకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాల పాలన కన్నా ఈ రెండున్నర సంవత్సరాల లోని అత్యధికంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు తెలంగాణ రాష్ట్రంలో అందించామని అన్నారు ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ పేదలకు ఆరోగ్యశ్రీ సేవలను ఐదు లక్షలకు పెంచి పేదవారి జీవితాల్లో వెలుగులు నింపింది అన్నారు,అలాగే భారత దేశంలోనే సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మన రాష్ట్రం అన్నారు,దేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా రెండు లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమే అన్నారు అలాగే రైతులకు ఉచిత కరెంటు కావచ్చు రైతు భరోసా పథకం కావచ్చు ఇలా కేవలం రైతులకే ఈ రెండున్నర సంవత్సరాలలోనే లక్ష కోట్ల వరకు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం మనది అన్నారు అలానే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుంది ఆ విధంగానే మహిళలకు చేయూతను అందించడానికి ఉచిత ప్రయాణం మరియు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం మరియు మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు రైస్ మిల్లులను కూడా అందిస్తున్నాము అన్నారు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజా ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టి అట్టడుగు వర్గాల ప్రజలకు చేరేలా ప్రణాళిక రూపొందించి దాన్ని అమలు చేస్తున్న తరుణం అందరూ చూస్తున్నారు అన్నారుఈ కార్యక్రమంలో ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తాళ్ల విజయ్ రెడ్డి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తలారి నర్సింలు చికోడ్ గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పు రమేష్ మాజీ కోఆప్షన్ షాదుల్ పాప ఎన్ ఎస్ యు ఐ నాయకులు మిడిదొడ్డి భాను మామిండ్ల ఆంజనేయులు దాప మహేష్ బండారి సాయి లబ్ది దారులు పాల్గొన్నారు




# వేములవాడ పీఎం శ్రీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ దీక్ష స్వీకారం.

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంచడమే స్కౌట్స్ లక్ష్యం: ఎంఈఓ బూర సదానందం



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01** వేములవాడ పట్టణంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ 'దీక్ష స్వీకార కార్యక్రమం' అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు చెందిన 16 మంది స్కౌట్స్ మరియు 16 మంది గైడ్స్ విద్యార్థులు క్రమశిక్షణతో దీక్షను స్వీకరించారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక స్కౌట్స్ అండ్ గైడ్స్ దుస్తులను అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి బూర సదానందం మరియు ప్రధానోపాధ్యాయులు రాజారత్నం మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే దేశభక్తి, సేవాభావం మరియు క్రమశిక్షణ వంటి గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించడం, జంతువుల పట్ల దయ చూపడం మరియు వృద్ధులకు సేవ చేయడం వంటి ఉన్నతమైన విలువలను స్కౌట్స్ అండ్ గైడ్స్ నేర్పిస్తుందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు.

# భీమన్న సన్నిధిలో చల్మెడ దంపతులు: వేములవాడ భీమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

- వైభవంగా భీమేశ్వర స్వామి దర్శనం.. తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ అర్చకులు
- లోక కల్యాణం కోసం చల్మెడ లక్ష్మీనరసింహారావు దంపతుల ప్రత్యేక పూజలు

**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 01** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి సన్నిధి బుధవారం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తన సతీమణి సునీలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న చల్మెడ దంపతులకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ మహా మండపంలో అర్చకులు వారికి వేద మంత్రాలతో ఆశీర్వచనం గావించి, స్వామివారి శేష వస్త్రం మరియు





తీర్థప్రసాదాలను అందజేశారు. లోక కల్యాణం కోసం, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, జోగిని శంకర్ మరియు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తులో వాహనం నడపరాదు...

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఆరుగురిపై కేసులు -ఎస్సై లక్ష్మణ్



**వీర్నపల్లి ఏప్రిల్ 1 (ప్రజా దివాస్)** మత్తుతో వాహనం నడిపితే అది ప్రాణాన్ని హరిస్తుందని డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై లక్ష్మణ్ వాహనదారులకు సూచించారు ప్రయాణంలో సురక్షితంగా ఇంటికి చేరాలంటే ప్రతి ఒక్కరు తలకు హెల్మెట్ ను ధరించి మద్యం తాగకుండా సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఆరు గురిపై కేసులు చేశామన్నారు.

# ఐడీఓసీలో డీఎల్టీసీ సమావేశం

- అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష

**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ -01 ప్రజా దివాస్** డిస్ట్రిక్ట్ లెవెల్ టెలికాం కమిటీ (డీఎల్టీసీ) సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ భారత్ నిధి( డీ బీ ఎన్), రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్, టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా, భారత్ నెట్ ఇన్ఫ్రా, కాల్ బీ ఫోర్ యూ డీజీ మొబైల్ అప్లికేషన్ తదితర అంశాలపై సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్న సందర్భంగా ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా టీ ఫైబర్, బీ ఎస్ ఎన్ ఎల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, టీ ఫైబర్, బీఎస్ ఎన్ఎల్ అధికారులు, మిషన్ భగీరథ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

